బ్యాక్టీరియా తెగుళ్లు.. వరి పైరుకు తీవ్ర నష్టం

- సరైన యాజమాన్య పద్ధతులతో ఎండాకు తెగులు నివారణ
- శిలీంద్ర నాశినుల పిచికారీతో ప్రయోజనం శూన్యం
- డాక్టర్ శ్రీనివాస్, సహ సంచాలకులు, ప్రాంతీయ పరిశోధనా స్థానం మార్టేరు


ఎండాకు తెగులు సోకిన వరి పైరుకు


తెగుళ్ల నిర్ధారణకు గాజుగ్లాసులో వేసి పరీక్షిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: ఆంధ్రప్రదేశ్‌లో అధిక విస్తీర్ణంలో పండించే వరి పంటకు వివిధ రకాల తెగుళ్ల ఆశిస్తున్నాయని, అందులో ముఖ్యంగా ఈ మధ్యకాలంలో సార్వా పంట కాలంలో వర్షపాతం ఎక్కువగా నమోదు అవుతున్న సమయంలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు సమస్యాత్మకంగా మారిందని, మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం సహ సంచాలకులు డాక్టర్ టి శ్రీనివాస్ తెలిపారు. ఈదశ నారుమడి చివర దశలో నాట్లు వేసి 15–30 రోజుల మధ్యలోపుగా వరి మొక్కలు పసుపు రంగుకు మారి చనిపోతున్నాయని ఇది ఎండాకు తెగులు మొదటిదైన క్రెసెక్ దశ. దీనిని సరైన సమయంలో గుర్తించి రైతులు యాజమాన్య చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. క్రెసెక్ దశ లక్షణాలు, యాజమాన్య పద్ధతులను ఆయన వివరించారు.

క్రెసెక్ దశ

ఈ దశ ఎంటీయూ 1318, పీఎల్‌ఏ 1100, బీపీటీ 5204 రకాలలో ఎక్కువగా కనిపిస్తుందని, ఈ దశ నారుమడి నుంచి నాట్లు వేసి నెల రోజుల వరకు వరి పంటను ఆశిస్తుందని, నారుమడిలో ఆకుల అంచుల నుంచి లోపలి వైపునకు నీటి డాగుల మచ్చలు మాదిరిగా ఏర్పడి క్రమేపీ పసుపురంగుకు మారతాయన్నారు. తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు దుబ్బులో కొన్ని పిలకలు, లేదా దుబ్బు మొత్తం చనిపోతుందని, దీన్ని క్రెసిక్ దశ అని పిలుస్తామని, చాలా మంది రైతులు ఈ లక్షణాలను కాండం తొలుచు లేక దుబ్బు కుళ్లు తెగుళ్ల అని పొరబడి శిలీంద్ర నాశినులు పిచికారీ చేయడం ద్వారా తెగుళ్ల నివారణ సరిగా జరగకపోగా, సాగులో ఖర్చు పెరుగుతుందన్నారు.

ఊజ్ పరీక్ష

తెగుళ్ల నిర్ధారణ కొరకు ఎండిన ఆకులను చిన్న ముక్కలుగా కత్తిరించి మంచినీటితో ఉన్న గాజుగ్లాసులో వేయాలి. ఇలా చేయడం వల్ల తెగులు సోకిన భాగాల నుంచి బ్యాక్టీరియా నీటిలోకి ప్రవించడం వల్ల కొద్ది గంటల తరువాత నీటి గాఢత పెరగడం, పసుపురంగుకు మారుతుందన్నారు. ఈ లక్షణాల ఆధారంగా ఆ పంటను బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించినట్లు గుర్తించాలి. అదే ఆరోగ్యవంతమైన ఆకులను కోసినప్పుడు ఇటువంటి లక్షణాలు ఆ గ్లాసులో కనిపించవు. అదే కాండం కుళ్లు ఆశించిన పిలకలను గమనిస్తే మొదటి కణుపు వద్ద కుళ్లి నలుపు రంగుకు మారి మొక్క చనిపోతుందన్నారు. అటువంటి పిలకలను చీల్చి చూస్తే మొదటి కణుపు వద్ద నల్లగా మారుతుందని, బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించిన మొక్కలు ఇటువంటి కుళ్లు లక్షణాలు కనిపించకుండానే పిలకలు ఎండిపోతాయన్నారు.


డాక్టర్ పి శ్రీనివాస్,

తెగుళ్ల యాజమాన్యం

తెగులు సోకని ఆరోగ్యవంతమైన పొలంలో మంచి విత్తనం సేకరించుకోవాలి. తెగుళ్ల ఎక్కువగా ఆశించే ప్రాంతాల్లో తెగుళ్ల కొంతవరకు తట్టుకుని ఆర్‌పీ బయో 226, స్వర్ణ, డీఆర్‌ఆర్ దాన్–48, 53,58,59.60,62 రకాలను సాగు చేసుకోవాలన్నారు. తెగుళ్ల తట్టుకోలేని ఎంటీయూ 1121 రకాన్ని సార్వాలో సాగు చేయవద్దని ఆయన చెప్పారు. ఒక లీటరు నీటిలో 1.0 గ్రాములు ప్లాంటోమైసిన్ కలిపి ఆనీటిలో విత్తనాలు నానబెట్టి విత్తుకోవడం ద్వారా తెగుళ్ల నివారించుకోవచ్చన్నారు. ఒక లీటరు మందు ద్రావణం, ఒక కిలో విత్తనానికి సరిపోతుందన్నారు. తెగుళ్ల కలుగజేసే బ్యాక్టీరియా నేలల్లో మొక్కలు అవశేషాలు, పంట వ్యర్థాలలో ఉంటుందని, మురగదమ్ము సరిగా చేసుకోవాలన్నారు. నత్రజని ఎరువులు సిఫార్సు చేసిన మేరకే రెండు మూడు దఫాలు వాడాలి. స్వర్ణ, ఎంటీయూ రైస్ 1318 వంటి రకాలలో నత్రజని ఎక్కువగా వేయరాదన్నారు. వర్షాలు పడే వాతావరణం, ఆకులపై తెగుళ్ల లక్షణాలు 5 శాతం కంటే ఎక్కువగా ఉంటే పైపాటుగా వేయాల్సిన నత్రజని ఎరువులను తాత్కాలికంగా నిలుపుదల చేయాలన్నారు. సిఫార్సు చేసిన పొటాష్ ఎరువును మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో రెండు దఫాలుగా నాట్లు వేసే దశలోను, అంకురం దశలోను వేసుకోవాలన్నారు. పొలంగట్లపై బ్యాక్టీరియా ఆవాసం కల్పించే తుంగ, సింపెర వంటి గడ్డి జాతి కలుపును నివారించాలన్నారు. తెగుళ్ల లక్షణాలు గమనించిన వెంటనే పొలంలో నీటిని రెండు మూడుసార్లు మురుగునీటి కాలువల ద్వారా బయటకు పంపడం వల్ల తెగుళ్ల ఉధృతి తగ్గుతుందన్నారు. తెగుళ్ల నివారణకు సరైన మందులు అందుబాటులో లేనందున బ్యాక్టీరియా నాశినులు కొంతమేరకే పనిచేస్తున్నాయన్నారు. ఈ తెగుళ్ల ఆశించినట్లు అనుమానం వస్తే వ్యవసాయ శాస్త్రవేత్తలను, వ్యవసాయ అధికారులను సంప్రదించి సలహాలు నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

పెంపుడు జంతువులపై శ్రద్ధ వహించాలి


కుక్కలకు టీకాలు వేస్తున్న వైద్యులు


పెనుగొండలో వ్యాక్సినేషన్‌ను ప్రారంభిస్తున్న వైద్యులు


పెంపుడు కుక్కకు రేబిస్ టీకా చేస్తున్న వైద్యులు

నరసాపురం రూరల్ : పశు సంరక్షణపై వాటి యజమానులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏడీఏ డాక్టర్ వై సుధాకర్, పశువైద్యులు ఇంజేటి సురేంద్ర పేర్కొన్నారు. నరసాపురంలోని ఏరియా పశు వైద్యశాల ప్రాంగణంలో శనివారం జూనోసిస్‌డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్లు వేశారు. మానవాళి జీవనంలో భాగమైన కుక్కలు, ఆవులు, గేదెలు తదితర వాటిని సంరక్షించుకుని వాటిని కాపాడవలసిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ సందర్భంగా సుమారు 135 కుక్కలకు ఉచితంగా రాబిస్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో పశువైద్యశాల సిబ్బంది పుష్ప యాంజిల్, వి కాంచనగంగ పాల్గొన్నారు.

జంతువుల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలి

పెనుగొండ: జంతు ప్రేమికులు వాటి నుంచి వచ్చే ప్రమాదపు వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి జాగ్రత్తలు వహించాలని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ అన్నారు. శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెనుగొండలోని పశు వైద్య శాల వద్ద రేబిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యంగా కుక్కల పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువైద్యాధికారిణి ఎం ప్రమీలారాణి మాట్లాడుతూ పశువుల, జంతువుల పెంపకందారులు వాటి పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండి, వ్యాధుల బారిన పడకుండా వాటిని కాపాడాలన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖాధికారులు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ నిరోధక టీకాలు

మొగల్తూరు: స్థానిక పశువైద్య శాల పరిధిలోని సుమారు 84 కుక్కలకు రేబిస్ వ్యాధి సోకకుండా టీకాలు వేసినట్లు వెటర్నరీ డాక్టర్ గొట్టుముక్కల నీలిమ తెలిపారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా శనివారం పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలిమ మాట్లాడుతూ వెటర్నరీ ఆసుపత్రుల్లో ఉదయం నుంచి పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు రేబిస్ సోకకుండా ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేశామని, ముందు జాగ్రత్తగా ప్రతి పెంపుడు కుక్క యజమానులు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ లైవ్ స్టోక్ అధికారి జి.శ్రీనివాసరావు, పారా సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు వెటర్నరీ ఆసుపత్రిలో..

పాలకొల్లు సెంట్రల్: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం కుక్కలకు కేబిస్ నిరోధక టీకాలు పశువుల ఆస్పత్రుల్లో ఉచితంగా వేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సహాయ సంచాలకులు డాక్టర్ జి మల్లేశ్వరరావు మాట్లాడుతూ జంతువులకు జూనోసిస్ వ్యాధులు రాకుండా సకాలంలో టీకాలు వేయించాలన్నారు. ముందుగా స్థానిక ఎంఎంకేఎస్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జూనోసిస్ డేపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి మండల వెటర్నరీ వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి , డాక్టర్ ప్రసాద్, ఎల్ఎస్ఏ సతీష్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు జయభారతరెడ్డి, నెస్ట్ సభ్యులు మనీష్ గౌడ్ పాల్గొన్నారు.

80 పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు

పోడూరు: పోడూరు, జిన్నూరు, పెనుమదం, పండితవిల్లూరు పశువైద్యశాలల్లో శనివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని నాలుగు పశువైద్యశాలల్లో ఇప్పటి వరకు 80 పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ నిరోధక టీకాలు వేశామన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు అన్ని పశువైద్యశాలల్లోనూ ఉచితంగా రాబిస్ టీకాలు వేస్తామన్నారు. పోడూరు వెటర్నరీ ఏడీ డాక్టర్ పి.జయకర్ జాన్సన్, డాక్టర్ మాధురి, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులతో మూగ జీవాలకు ప్రాణగండం

- పశువులకు ప్రమాదకర వ్యాధులు సోకే అవకాశం
- ముందస్తు చర్యలతో ప్రాణనష్టం నివారణ

నరసాపురం రూరల్: వర్షాకాలంలో పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. వర్షాకాలంలో గడ్డితోపాటు నీరు, గాలిలోనూ పశువులకు రకరకాల వ్యాధులు కలుగజేసే క్రిమికీటకాలు, సూక్ష్మజీవులు ఉంటాయి. ఈ సీజన్‌లో పాడి పశువులకు, గొర్రెలు, మేకలకు పలు వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ముందస్తుగా నివారణ చర్యలు తీసుకుంటే పశుసంపదను కాపాడుకోవచ్చునని పశు సంవర్ధకశాఖ అధికారులు సూచిస్తున్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాపించే వ్యాధులు

వర్షాకాలం వచ్చినప్పుడు పచ్చిగడ్డి విపరీతంగా పెరుగుతుంది. ఈ గడ్డిని తినడం వల్ల పశువుల కడుపులోకి పరాన్న జీవులు వెళ్లి చిటుకు వ్యాధి (మాదిగ వ్యాధి లేదా దొమ్మ రోగం) ప్రబలుతుంది. ఈ వ్యాధి సోకిన వెంటనే గొర్రె, మేక అతి తక్కువ సమయంలోనే మృతి చెందుతుంది.

పశువులకు సోకే వ్యాధులు

వర్షాకాలంలో పశువులకు కూడా వ్యాధులు వ్యాప్తిస్తాయి. వీటిలో గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం అధికం. ఈ వ్యాధి సోకడం వల్ల గొర్రెలు, మేకలకు గాలి గిట్టల మధ్య పుండు కావడం, కాస్త ఆలస్యం అయితే నీరసించి అవి పడిపోవడం, మరీ ఎక్కువ అయితే ఆ పశువు మరణిస్తుంది. నోటిలో పుండు, చీము కారడంతో పశువులకు విపరీతమైన జ్వరం వస్తుంది.ఈ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేయిస్తే మరణాల శాతం తగ్గించుకోవడంతో పాటు పశువుల మందను కాపాడుకోవచ్చునని అధికారులు సూచిస్తున్నారు.

ముందు జాగ్రత్తలు పాటించాలి

వ్యాధులు సోకినప్పుడు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి నివారణ సులభమవుతుంది. సీజన్‌లో ముందుగా టీకాలు వేయించాలి. టీకాను వేయించిన 24 రోజుల తరువాత దీని ప్రభావం పనిచేస్తుంది. రైతులు పశువులకు సొంత వైద్యం చేయడం మానేయాలి. ఇలా చేయడం వల్ల పశువుకు సోకిన వ్యాధి మరింత ముదిరి మరణించే అవకాశం ఉంటుంది.



– పశువైద్యాధికారి ఐ.సురేంద్ర కుమార్

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీ


పాలకొల్లులో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు


ఆచంటలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

పాలకొల్లు అర్బన్: యాళ్లవానిగరువు, పట్టణంలోని 22వ వార్డులో ఎరువుల దుకాణాలను శనివారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఎరువుల దుఖాణాల లైసెన్స్‌లు, రికార్డులు, నిల్వలు, ఎరువుల పరిణామం , బరువులను పరిశీలించారు. విజిలెన్స్ అధికారులు కె మహారాజు, టి జనార్దనరెడ్డి, పాలకొల్లు ఏడీఏ అడ్డాల పార్వతి, వ్యవసాయాధికారి ఎం సామ్యూల్ జాన్సన్, వీఏఏ టి భరత్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో ఆచంట, పెనుగొండ మండలాల్లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా శనవారం ఎరువులు, పురుగు మందులు షాపులను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పెనుగొండ మండలంలో పలు దుకాణాల్లో సరైన రికార్డులు, స్టాకు వివరాలు సక్రమంగా లేవంటూ రూ.31.57 లక్షల విలువైన 10.2 టన్నుల పురుగు మందు విక్రయాలను నిలిపివేశారు. వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగానే వీటిని నిర్వహించినట్లు వ్యవసాయశాఖాధికారులు తెలిపారు. పెనుగొండ మండలంలో విజయనగరం జిల్లాకు చెందిన వ్యవసాయ సహాయ సంచాలకులు కే మహరాజ్, విజిలెన్స్ ఎస్సై టి జగన్నాథరెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. స్టాకులు, రికార్డులపై సరైన ఆధారాలు లేకపోవడంతో విక్రయాలు నిలిపివేయాలంటూ ఆయా దుకాణ యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. పెనుగొండలో నిర్వహించిన తనిఖీల్లో ఉన్నతాధికారులతో పాటు మండల వ్యవసాయాధికారి పి స్పందన, జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయపు టెక్నికల్ ఏఓ. కే కృష్ణకాంత్ పాల్గొన్నారు. ఆచంటలోనూ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, స్టాకులపై సరైన సమాచారం ఇవ్వడంతో విజిలెన్స్ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీల్లో పాలకొల్లు ఏడీఏ అడ్డాల పార్వతితో పాటు, ఆచంట విస్తరణాధికారి బి నాగరాజు పాల్గొన్నారు.

అద్దేపల్లి దాతృత్వం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు చరిత్రలో స్వాతంత్ర సమరయోధుడు, విద్యాదాత, నిర్వార్థ ప్రజాసేవకులు అద్దేపల్లి సత్యనారాయణమూర్తి దాతృత్వం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. పట్టణంలో స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అద్దేపల్లి సత్యనారాయణమూర్తి 125వ జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. మంత్రి నిమ్మల రామానాయుడు తదితరులు అద్దేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య సంఘానికి చెందిన ప్రముఖులను ఘనంగా సన్మానించారు. అంగర రామ్మోహన్, పెచ్చెట్టి బాబు, రేపాక ప్రవీణ్ భాను, కేవి కృష్ణవర్మ, బోణం చినబాబు, జీవి, కర్నేన రోజారమణి, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, కోడి విజయభాస్కర్, జక్కంపూడి కుమార్, మామిడిశెట్టి పెద్దిరాజు, పీతల శ్రీనివాస్, మేడిశెట్టి కేశవ పాల్గొన్నారు.

రహదారిపై వర్షపు నీరు.. ప్రయాణికుల అవస్థ


మొగల్తూరు, గొల్లగూడెంలో రోడ్డుపై వర్షపునీరు


మొగల్తూరులో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డు దుస్థితి

మొగల్తూరు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత నెల 29, 30 తేదీల్లో 61.2 మిల్లీమీటర్లు, ఈనెల 3న 35 మిల్లీమీటర్లు. 5న 35.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో మొగల్తూరులోని ప్రధాన రహదారులైన గొల్లగూడెం రోడ్డు, స్టేషన్‌రోడ్డు, రామాలయం నుంచి కోట మీదుగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారిలో వర్షపు నీరు నిలిచిపోయింది. అసలే భారీ గోతులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు వాటిలో వర్షపు నీరు చేరడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్లపై గోతులను వెంటనే పూడ్చించి వాహనదారుల ఇక్కట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు


ఆచంటలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి

పెనుగొండ: సమ సమాజ స్థాపనకు కృషి చేసిన సమతావాది భారత ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్‌కు బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని ఆచంట ఎంపీపీ దిగరమ్మి సూర్య కుమారి అన్నారు. శనివారం ఆచంటలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కందరవల్లి సర్పంచ్ బోడపాటి బుల్లియ్య, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలి

పెనుగొండ: పారిశుద్ధ్య నిర్వహణపై ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి అన్నారు. శనివారం పెనుగొండ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ యాక్షన్ ప్లాన్ నిర్వహణపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సర్పంచ్ పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాస్, ఏఈ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి టి రత్నాకరరావు, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్లు, సచివాలయ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు

పాలకొల్లు సెంట్రల్: పేద ప్రజలకు ఆరోగ్యం, విద్యకు అవసరమైన సహాయ సహకారాలు అందించడంలో వాకర్స్ క్లబ్ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని పట్టణ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అన్నారు. శనివారం ఎనిమిది మంది పేద వృద్ధులకు రూ.40 వేల వ్యయంతో కంటి శస్త్ర చికిత్స చేయించి వారికి అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు షేక్ పీర్‌సాహెబ్, మానెం బసవరాజు, పోతుల ఉమాశంకరరావు, జవ్వాజి కళ్యాణ్, లయన్స్ కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తం

పాలకొల్లు అర్బన్: డయేరియా వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సతీష్ అన్నారు. యలమంచిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం మండల మహిళా సమాఖ్య సభ్యులతో డయేరియా వ్యాధిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా తదితర విష జ్వరాలు ప్రబలే అవకాశాలుంటాయన్నారు. ప్రజల నివాసిత ప్రాంతాల్లో మురుగు గుంటలు లేకుండా చూసుకోవాలన్నారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతుంటే గ్రామంలోని ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సోని, ఎంపీహెచ్ఈవో జేవీ సత్యనారాయణ, హెచ్‌వీ సరోజనమ్మ, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాల్లో వారాహి పూజలు ప్రారంభం

మొగల్తూరు: మోళ్లపర్రు కనకదుర్గ బీచ్‌లోని దశావతార సహిత మత్స్యనారాయణ స్వామి, అష్టలక్ష్మీ సమేత ఆదిలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో శనివారం వేకువ జాము నుంచి వారాహి పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకుడు ప్రవీణ్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో నక్షత్ర దోషాలు, కార్యసిద్ధి దుష్టగ్రహ నివారణకు ప్రతి రోజు విశేషార్చనలు నిర్వహించారు. నరసాపురం మండలం చినమైనవాని లంక నుంచి సుమారు 50 మంది భక్తులు కాలినడకన అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తులకు అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేయడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కిడ్నీ రోగికి ఆర్థిక సహాయం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు రూరల్ పంచాయతీ నాగరాజుపేటకు చెందిన గుబ్బల కొండ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. వైద్య ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు దృష్టికి రోగి బంధువులు తీసుకువెళ్లారు. దీంతో ఫౌండేషన్ పాలకొల్లు కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు శనివారం రూ.10వేల ఆర్థిక సహాయం చెక్కును కొండ తల్లి కుమారి, కుమార్తె జ్యోతికి అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ వెంకట్రామరాజుకి కిడ్నీ రోగి కొండ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నరసాపురం అభివృద్ధికి కృషి

నరసాపురం: నరసాపురం నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం రాయల్ క్లబ్ ఆఫ్ నరసాపురం ఆధ్వర్యంలో స్థానిక తెలగా కల్యాణ మండపంలో నాయకర్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ, వై.ఫణికర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే నాయకర్ కృషి చేయాలని సూచించారు.

ప్రమాదకరంగా డ్రెయిన్

నరసాపురం: నరసాపురం బస్టాండ్ వద్ద డ్రెయిన్‌పై సిమెంట్ పలకలు లేకుండా ప్రమాదకరంగా ఉంది. నిత్యం వేలాది మంది ఈ మార్గం గుండా ప్రయాణిస్తారు. అలాంటి ఈ మార్గంలో పరిస్థితి ఇంత ప్రమాదకరంగా ఉన్నా, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల బస్టాండ్ పక్కనున్న డ్రెయిన్‌ను బాగు చేసి, సిమెంట్ పలకలు పక్కకు తీశారు. పని పూర్తయిన తరువాత, తిరిగి వాటిని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. డ్రెయిన్‌పై మూతలు లేకపోవడంతో అనేక మంది, గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. ఈ డ్రెయిన్ పూర్తిగా శిథిలమైంది. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పూడుకుపోయిన డ్రెయిన్

నరసాపురం: స్థానిక రాయిపేటలో డీసీసీబీ బ్యాంకు రోడ్డులోని డ్రెయిన్ పూడుకుపోయి మురుగుపారడం లేదు. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. అటుగా వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో మునిసిపల్ అధికారులు డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టారు. ఈ పనులు కొన్ని ప్రాంతాలకే పరిమితమయ్యాయి. చాలా వరకూ ప్రధాన ప్రాంతాల్లో మాత్రం అలాగే వదిలేశారు. డీసీసీబీ బ్యాంక్ రోడ్డులో పలు విద్యాసంస్థలున్నాయి. ఇటుగా వెళ్లేవారు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. డ్రెయిన్‌ను శుభ్రం చేసి సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బడి పిల్లలకు మొండిచేయి చూపిన చంద్రబాబు

పోడూరు: అధికారంలోకి వచ్చిన వెంటనే కుటుంబంలో ఎంతమంది పిల్లలు బడికి వెళ్లినా వారికి రూ.15వేలు చొప్పున ఇస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ హామీని నెరవేర్చకుండా బడి పిల్లలకు మొండిచేయి చూపారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి దేవ రాజేష్ శనివారం విమర్శించారు. సీఎం చంద్రబాబు అధికారం చేపట్టాక రాష్ట్రంలో విద్యా వ్యవస్థ కుంటుపడిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద పిల్లలకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు 25శాతం సీట్ల కేటాయింపును చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేయడం అనాలోచిత నిర్ణయమని రాజేష్ విమర్శించారు. ప్రత్యేక హోదా కోసం కేంద్రాన్ని నిలదీసే అవకాశం ఉన్నా చంద్రబాబు ఢిల్లీ వెళ్లి నోరు మెదపకుండా రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించడం చాలా దుర్మార్గమని విమర్శించారు.

వేములదీవి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

నరసాపురం రూరల్: వేములదీవి గ్రామం కాపుల కొడపలో వేంచేసి ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి వారికి ఏడు వారాల ప్రదక్షిణలు చేయడం, మొక్కులు చెల్లించి, తలనీలాలను సమర్పించే భక్తుల సంఖ్య పెరగడంతో ప్రధాన రహదారి మొత్తం మధ్యాహ్నం వరకూ భక్తులతో కిక్కిరిసి ఉంది. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నసమారాధనలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. స్వామి వారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.